నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
06.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
10 జూలై 2024
పేజీలు 8

**దాజీకి లండన్ అవార్డు**

రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు, హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్ డీ పటేల్ (దాజీ)కు లండన్ అవార్డు లభించింది. ఫ్రీడమ్ ఆఫ్ ది సిటీ ఆఫ్ లండన్ అవార్డును లండన్‌లో అందుకున్నట్టు రామచంద్ర మిషన్ మే 23న వెల్లడించింది. విద్య, వైద్యం, పర్యావరణం వంటి రంగాల్లో దాజీ చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డు అందించారు. దీంతో పాటు కామన్‌వెల్త్ సెక్రటేరియట్‌తో ప్రత్యేక అవగాహన ఒప్పందం చేసుకున్నారు.

# ప్రపంచంలో అతిపెద్ద జీవవైవిధ్య దేశం ఏది?

గ్రూప్స్ ప్రత్యేకం
జనరల్ నాలెడ్జ్

గతవారం 3వ పేజీ తరువాయి

**స్టాక్‌హోం సదస్సు- 1972**

- ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో 1972 జూన్ 5-16 మధ్య స్టాక్‌హోం (స్వీడన్)లో మొదటి అంతర్జాతీయ పర్యావరణ సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో 26 సూత్రాలతో పర్యావరణ అభివృద్ధిపై డిక్లరేషన్ చేస్తూ కార్యాచరణ ప్రణాళిక కింద 109 సిఫారసులను తీర్మానం చేశారు. పర్యావరణ సమస్యలను పరిష్కరించడానికి 1972 జూన్ 5న ఐరాస ఏజెన్సీగా 'ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (UNEP)'ను ఏర్పాటు చేశారు.
- ప్రపంచ వాతావరణ సంస్థ, ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (యూఎన్ఈపీ) ఆధ్వర్యంలో 1988లో 'వాతావరణ మార్పులపై అంతరప్రభుత్వ ప్యానెల్ (Intergovernmental Panel on Climate Change- IPCC)' ను ఏర్పాటు చేశారు.
- 1972 నుంచి ఏటా జూన్ 5న అంతర్జాతీయ పర్యావరణ అవగాహన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

**ధరిత్రీ లేదా పృథ్వీ సదస్సు- 1992**

- 1992 జూన్ 3-14 మధ్య బ్రెజిల్ రాజధాని రియోడిజనీరోలో ఐక్యరాజ్యసమితి పర్యావరణ, అభివృద్ధి సదస్సు లేదా పృథ్వీ సదస్సును నిర్వహించారు.

**ఈ సమావేశంలో చర్చించిన అంశాలు**

ఎ) రియో పర్యావరణ, అభివృద్ధి డిక్లరేషన్
బి) వాతావరణ మార్పు (UNFCCC)
సి) ఎజెండా- 21 (సుస్థిరాభివృద్ధి)
డి) అటవీ సంరక్షణ సూత్రాలు
ఇ) జీవవైవిధ్యం
ఎఫ్) ఎడారీకరణ

- 1992, మే 9న కుదిరిన అంతర్జాతీయ పర్యావరణ సంధి ఫలితంగా అదే ఏడాది జూన్‌లో నిర్వహించిన ధరిత్రీ సదస్సు వాతావరణ మార్పులపై ప్రధానంగా చర్చించింది. ఫలితంగా ఐక్యరాజ్యసమితి వాతావరణ మార్పుల చట్టం (UNFCCC) రూపొందింది. ఇది 1994, మార్చి 21న అమల్లోకి వచ్చింది. ఈ సంధి ప్రకారం వాతావరణ మార్పులపై ఏటా సమీక్ష జరపాలని నిర్ణయించారు. 1995 నుంచి వీటిని క్రమం తప్పకుండా నిర్వహించాలని తీర్మానించారు. వీటినే UNFCCC లేదా COP సదస్సులు అంటారు.
- రియోడిజనీరో ధరిత్రీ సదస్సులో మరో అంశంగా జీవవైవిధ్య చట్టాన్ని (Convention on Biological Diversity) ఆమోదించారు. 1993, డిసెంబర్ 29 నుంచి ఇది అమల్లోకి వచ్చింది.
- వివిధ జాతులకు చెందిన జీవులు ఒకే సమూహంలో కలిసి జీవించడాన్ని జీవవైవిధ్యం అంటారు. వివిధ రకాల జీవులను సంరక్షించడానికి 2000 జనవరిలో కార్టజీనా ప్రొటోకాల్ ఆన్ బయోసేఫ్టీ ఒప్పందం జరిగింది. ఇది 2003, సెప్టెంబర్ 11 నుంచి అమల్లోకి వచ్చింది.
- ప్రపంచంలో అతిపెద్ద జీవవైవిధ్య దేశం బ్రెజిల్. ఏటా మే 22న అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని, ఏప్రిల్ 22న అంతర్జాతీయ ధరిత్రీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



- స్విట్జర్లాండ్‌లోని వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) ప్రపంచంలో అంతరించిపోతున్న జీవులను 'రెడ్ డాటా బుక్ (రెడ్‌లిస్ట్)'లో ప్రచురిస్తుంది.

**క్యోటో ప్రొటోకాల్ ఒప్పందం- 1997**

- జపాన్ రాజధాని క్యోటో వేదికగా 1997, డిసెంబర్ 11న జరిగిన సదస్సులో ఈ ఒప్పందం కుదిరింది. ఈ సమావేశంలో పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలు కర్బన ఉద్గారాలను తగ్గించాలని సమావేశ సభ్య దేశాలు తీర్మానించాయి. కార్బన్ ట్రేడింగ్, పరిశుభ్రత అభివృద్ధి విధానాలు, ఉమ్మడి అమలు కార్యక్రమాలను అన్ని దేశాలు పాటించాలని పేర్కొన్నారు. దీన్నే క్యోటో ప్రొటోకాల్ ఒప్పందం అంటారు. ఈ తీర్మానం 2005, ఫిబ్రవరి 16 నుంచి అమల్లోకి వచ్చింది.

**మాంట్రియల్ ప్రొటోకాల్ ఒప్పందం- 1987**

- భూ ఉపరితలం నుంచి 30-34 కి.మీ. ఎత్తులో స్ట్రాటో ఆవరణంలో ఓజోన్ పొర ఉంటుంది. ఇది సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాలను భూమి పైకి రాకుండా అడ్డుకుంటుంది. అయితే భూమిపై క్లోరో ఫ్లోరో కార్బన్ల సంఖ్య పెరగడం వల్ల ఓజోన్ పొర ఛిద్రమైంది. దీన్ని మొదట 1975లో అంటార్కిటికా ఖండంపై గుర్తించారు. ఓజోన్ క్షీణతను తగ్గించడానికి 1987, సెప్టెంబర్ 16న ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో మాంట్రియల్‌లో ఓజోన్ తరుగుదల సదస్సును నిర్వహించారు. దీన్నే మాంట్రియల్ ప్రొటోకాల్ ఒప్పందం అంటారు. ఈ ఒప్పందం 1989, ఆగస్టు 26 నుంచి అమల్లోకి వచ్చింది. అందువల్ల ఏటా సెప్టెంబర్ 16న అంతర్జాతీయ ఓజోన్ అవగాహన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

**అంతర్జాతీయ సౌరకూటమి (ఐఎస్ఏ)- 2018**

- భూమిపై శిలాజ ఇంధన వనరులను తగ్గిస్తూ శిలాజేతర వనరులను పెంపొందించడానికి ప్రపంచవ్యాప్తంగా ఒక కూటమి ఏర్పాటైంది. ప్రధాని మోదీ కృషితో COP-21 పారిస్ సదస్సులో దీనికి బీజం పడింది. కర్కాటక, మకర రేఖల మధ్య ఉష్ణోగ్రత ఎక్కువగా పొందుతున్న 121 దేశాలతో సౌరకూటమిని ఏర్పాటు చేశారు. వీటినే సూర్యపుత్ర దేశాలు అంటారు. ఈ కమిటీ ప్రధాన ఉద్దేశం ఖనిజ చమురుకు ప్రత్యామ్నాయంగా సౌరశక్తి వనరును వినియోగించడం. దీన్నే ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ సోలార్ పాలసీ అండ్ అప్లికేషన్ (IASPA) అని పిలుస్తారు. దీని ప్రధాన కార్యాలయం గ్వాల్ పహరి, గురుగ్రామ్ (హరియాణా)లో ఉంది. మొదటి సదస్సు 2018, మార్చి 11న న్యూఢిల్లీలో జరిగింది. ఈ సమావేశం 2002 నాటికి 175 గిగావాట్ల సౌరశక్తిని ఉత్పత్తి చేయాలని తీర్మానించింది.

**పర్యావరణ ఉద్యమాలు**

- **బిష్ణోయి ఉద్యమం:** ఇది దేశంలో తొలి పర్యావరణ ఉద్యమంగా పేరుగాంచింది. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జిల్లా ఖేజర్లీ గ్రామానికి చెందిన అమృతాదేవి నాయకత్వంలో ఈ ఉద్యమం జరిగింది. 1730లో ఖేజ్రి వృక్షాలను రక్షించేందుకు 363 మంది ఉద్యమం చేసి ప్రాణాలు కోల్పోయారు.
- **సైలెంట్ వ్యాలీ ఉద్యమం:** కేరళలోని పాలక్కడ్ జిల్లాలోని ఉష్ణమండల అటవీ ప్రాంతాన్ని సైలెంట్ వ్యాలీ అంటారు. పెరియార్ నదికి ఉప నది అయిన కుధిపుజ నదిపై జలవిద్యుత్ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల అడవులు, జంతువులు, జీవరాశులు అంతరించిపోతున్నాయని ఆందోళన చేస్తూ 1973లో ఉద్యమం ప్రారంభమైంది. తర్వాత 1985లో ఈ ప్రాంతాన్ని సైలెంట్ వ్యాలీ నేషనల్ పార్క్‌గా మార్చారు.
- **చిప్కో ఉద్యమం:** ఉత్తరాఖండ్‌లోని చమోలి జిల్లాలో అడవుల నరికివేతకు వ్యతిరేకంగా 1973లో ఈ ఉద్యమం ప్రారంభమైంది. చిప్కో అంటే 'హత్తుకొను' అని అర్థం. చిప్కో ఉద్యమకారులు చెట్ల నరికివేతను వ్యతిరేకిస్తూ వాటిని హత్తుకొని ఈ ఉద్యమాన్ని ప్రారంభించారు. సుందర్‌లాల్ బహుగుణ, గౌరీ దేవి, చండీప్రసాద్ భట్ మొదలైనవారు ఈ ఉద్యమానికి నాయకత్వం వహించారు.
- **నవధాన్య ఉద్యమం:** జీవరాశులు అంతరిస్తున్నాయనే ఉద్దేశంతో జీవవైవిధ్య సంరక్షణకు, సేంద్రీయ వ్యవసాయానికి రక్షణ కల్పించేందుకు 1984లో వందనా శివ ఆధ్వర్యంలో ఈ ఉద్యమం జరిగింది.
- **అప్పికో ఉద్యమం:** చిప్కో ఉద్యమం తరహాలోనే అడవుల సంరక్షణ కోసం 1983 సెప్టెంబర్‌లో కర్ణాటకలో ఉత్తర కన్నడ జిల్లాలోని సల్కాని ప్రాంతంలో ప్రారంభమైంది. పాండురంగ హెగ్డే నాయకత్వంలో ఉద్యమం జరిగింది. కన్నడంలో అప్పికో అంటే 'కౌగిలించుకొను' అని అర్థం.
- **నర్మద బచావో ఆందోళన్:** మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో నర్మద నది ప్రవహిస్తుంది. పర్యావరణానికి హాని కలిగిస్తూ ఈ నదిపై చేపట్టే ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ఆయా రాష్ట్రాల్లో ఈ ఉద్యమం ప్రారంభమైంది. ముఖ్యంగా గుజరాత్‌లోని సర్దార్ సరోవర్ డ్యాంకు వ్యతిరేకంగా ఉద్యమం కొనసాగింది. ఈ ఉద్యమాన్ని 1989లో మేధా పాట్కర్ ప్రారంభించారు. బాబా ఆమ్టే, అరుంధతీ రాయ్‌లాంటి వారు కూడా ఈ ఉద్యమాన్ని కొనసాగించారు.

**8. ఎర్ర సముద్రం ప్రపంచంలోని అత్యంత ఉప్పగా ఉండే నీటి వనరుల్లో ఒకటి. దీనికి కారణం?**

1. అధిక బాష్పీభవనం, తక్కువ వర్షపాతం కలిగి ఉండటం
2. ఎర్ర సముద్రంలోకి నదీ ప్రవాహాలు లేకపోవడం
3. హిందూ మహాసముద్రం వంటి తక్కువ లవణీయత కలిగిన ఇతర మహాసముద్రాలతో పరిమిత అనుసంధానం కలిగి ఉండటం

**పై వాటిలో ఎన్ని సరైనవి?**

A) ఒకటి మాత్రమే B) రెండు మాత్రమే
C) మూడూ D) ఏదీకాదు

**సమాధానం:** C

**అదనపు సమాచారం:** ఎర్ర సముద్రం ఆసియా, ఆఫ్రికా ఖండాల మధ్యన ఉంది. గ్రీకు దేశానికి చెందిన హిప్పాలస్ అనే నావికుడు ఎర్ర సముద్రం నుంచి భారత దేశానికి సముద్ర మార్గం కనిపెట్టాడు. ప్రపంచ నౌక రవాణా రంగంలో అత్యంత కీలక మార్గం ఎర్ర సముద్రం. ఈజిప్టులోని సూయజ్ కాలువ మీదుగా ఈ మార్గాన్ని షిప్పింగ్ కంపెనీలు రవాణాకు ఉపయోగించుకుంటాయి. మధ్యధరా సముద్రం మీదుగా రవాణాకు ఇది అత్యంత దగ్గరి మార్గం. ఆఫ్రికా చుట్టూ తిరిగి రాకుండా దక్షిణ, తూర్పు ఆసియాలకు ఇది ఎంతో అనుకూలమైన మార్గం.

- ఎర్ర సముద్రం ఎన్నో భిన్న మత్స్య జాతులకు నిలయం. 1200 జాతుల చేపలు ఇందులో జీవిస్తున్నాయి. వీటిలో 10 శాతం ప్రపంచంలో మరే ఇతర చోట లభించవు.
- లవణీయత (ఉప్పదనం) విషయంలో ఎర్ర సముద్రం ప్రపంచ సగటు (4%) కంటే ఎక్కువ.

**9. భారతీయ చరిత్రకు సంబంధించి కింది జతలను పరిగణించండి.**

1. ఆర్యదేవుడు-జైన పండితుడు
2. దిగ్నాగుడు-బౌద్ధ పండితుడు
3. నాథముని-వైష్ణవ పండితుడు

**పై వాటిలో ఎన్ని జతలు సరిగ్గా సరిపోలాయి?**

A) ఒక జత మాత్రమే
B) రెండు జతలు మాత్రమే
C) మొత్తం మూడు జతలు
D) ఏదీకాదు

**సమాధానం:** B

**వివరణ:** ఆర్యదేవుడు-జైన పండితుడు తప్పు జత. ఆర్యదేవుడు బౌద్ధ తత్వవేత్త, ప్రసిద్ధ భారతీయ బౌద్ధ గురువు నాగార్జునుని శిష్యుడు. అతను బౌద్ధమతంలోని మాధ్యమిక తత్వశాస్త్రానికి చేసిన కృషికి ప్రసిద్ధి చెందాడు.

- దిగ్నాగుడు-బౌద్ధ పండితుడు సరైన జత. క్రీ.శ 480 నుంచి క్రీ.శ 540 వరకు జీవించిన దిగ్నాగుడు ఒక ముఖ్యమైన భారతీయ బౌద్ధ తార్కికుడు, తత్వవేత్త, తర్కం, జ్ఞాన శాస్త్రం, భాషా తత్వశాస్త్రంపై చేసిన కృషికి ప్రసిద్ధి చెందాడు. అతని కృషి భారతదేశంలో బౌద్ధ తత్వశాస్త్ర అభివృద్ధిని చాలా ప్రభావితం చేసింది.
- నాథముని- వైష్ణవ పండితుడు సరైన జత. నాథముని దేశంలోని తమిళనాడు రాష్ట్రంలో ఉన్న శ్రీరంగంలో సంస్కృత-తమిళ పాఠశాలను స్థాపించాడు. ఈ సంస్థ నేటికీ దక్షిణ భారతదేశంలో ఒక ముఖ్యమైన వైష్ణవ కేంద్రంగా ఉంది.

**10. పోర్చుగీస్ రచయిత న్యూనిజ్ ప్రకారం విజయనగర సామ్రాజ్యంలోని స్త్రీలు కింది వాటిలో ఏ రంగంలో నిష్ణాతులు?**

1. మల్లయుద్ధం (రెజ్లింగ్)
2. జ్యోతిష్య శాస్త్రం
3. అకౌంటింగ్
4. సోది చెప్పటం

A) 1, 2, 3 B) 1, 3, 4
C) 2, 4 D) 1, 2, 3, 4

**సమాధానం:** D

**వివరణ:** పోర్చుగీస్ యాత్రికుడు ఫెర్నావో న్యూనిజ్ అచ్యుత దేవరాయల కాలంలో సామ్రాజ్యాన్ని సందర్శించాడు (1535-37). న్యూనిజ్ ప్రకారం, పెద్ద సంఖ్యలో మహిళలు రాజభవనాల్లో నృత్యకారులుగా, గృహ సేవకులుగా, పల్లకీ మోసే వారుగా నియమితులయ్యారు. వీరిలో మల్లయోధులు, జ్యోతిష్యులు, సోది చెప్పేవారు కూడా ఉన్నారు. కొంతమంది మహిళలు అకౌంటెంట్లుగా, న్యాయమూర్తులుగా, న్యాయాధికారులుగా, వాచ్ ఉమెన్‌లుగా కూడా నియమితులయ్యారు అని న్యూనిజ్ పేర్కొన్నాడు.

**స్టేట్‌మెంట్స్ (3)**

ఎ. ఉద్యోగ నియామకాలు, ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్ల విషయంలో ప్రభుత్వం తప్పనిసరిగా రాజ్యాంగంలోని నిబంధన 371 (డి)(10)ని, రాష్ట్రపతి ఉత్తర్వులోని పేరా 14ని దృష్టిలో పెట్టుకోవాలని, హైదరాబాద్ నగరం ఆరో జోన్‌లో భాగమే అని హైకోర్టు తీర్పునిచ్చింది

బి. హైదరాబాద్ నగర పోలీసు చట్టం-1348(ఎఫ్) ద్వారా నియామకాలు పొందిన వారు రాష్ట్రపతి ఉత్తర్వుల్లోని 14 (ఎఫ్) నుంచి మినహాయింపునకు అర్హులం అని హైదరాబాద్‌ను ఫ్రీ జోన్‌గా పరిగణించడం సబబే అని పిటిషనర్ల వాదనను సుప్రీంకోర్టు పరిశీలించి తీర్పునిచ్చింది

**సరైన సమాధానాన్ని గుర్తించండి?**

1) ఎ సరైనది, బి తప్పు
2) ఎ తప్పు, బి సరైనది
3) ఎ, బి సరైనవి
4) ఎ, బి తప్పు

**హైదరాబాద్‌ను ఫ్రీ జోన్‌గా పరిగణించడాన్ని వ్యతిరేకిస్తూ జరిగిన సభ? (4)**

1) వరంగల్ ప్రజాసంఘాల గర్జన 2009, అక్టోబర్ 11
2) మానుకోట ప్రజా పోరాట గర్జన 2009, అక్టోబర్ 15
3) కరీంనగర్ ఉద్యోగ ఉపాధ్యాయ గర్జన 2009, అక్టోబర్ 21
4) సిద్దిపేట ఉద్యోగ గర్జన 2009, అక్టోబర్ 21

కె.భాస్కర్ గుప్తా
హైదరాబాద్

